## అకాల వర్షం



**ధర్మవరం-నవభూమి**జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. చోడవరంలో వడగండ్లు పడ్డాయి. కొన్నిచోట్ల ఈదురు గాలులు వీచడంతో ఎ, రేకుల షెడ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో పక్షం రోజుల నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు ఉపశమనం చెందారు. అనకాపల్లి పట్టణంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 20 నిమిషాలపాటు ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. 12.5 ఎం.ఎం.ల వర్షపాతనం నమోదైనట్టు ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు తెలిపారు. వర్షం కారణంగా పట్టణంలోని డ్రైనేజీ కాలువలు పొంగి మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. చోడవరంలో సుమారు అరగంటపాటు వడగండ్లతో భారీ వర్షం కురిసింది. అనకాపల్లి మండలంలో రేబాక పంచాయతీ శివారు కాపుశెట్టివానిపాలెంలో ఈదురుగాలుల కారణంగా కరణం రమణకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. వర్షం పడడంతో ఇంటిలోని సామాన్లన్నీ తడిసిపోయాయి. మునగపాక మండలంలో ఈదురు గాలులు వీచడంతో పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. మూలపేటల్నో కొబ్బరి చెట్టు విరిగి, విద్యుత్ లైన్‌పై పడడంతో నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. చీడికాడ, గొలుగొండ, సబ్బవరం, బుచ్చెయ్యపేట, కశింకోట మండలాల్లో జల్లులు పడ్డాయి. నర్సీపట్నం, రావికమతం, కోటవురట్ల, అచ్యుతాపురం, ఎలమంచిలి, కె.కోటపాడు, పాయకరావుపేట, రాంబిల్లి, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల్లో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా వుంది.

## గుణదల మాతకు గాలయగూడెం సర్పంచ్ వెంకట సుబ్బారావు వైఎస్ఆర్సిపి నేతలు పూజలు



**దెందులూరు. మార్చి 25 నవ భూమి** :విజయవాడలో గుణదల మేరీ మాతకు వైఎస్ఆర్సిపి నాయకులు గాలాయగూడెం గ్రామ సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు. వార్డ్ మెంబర్ కొండపల్లి శ్రీధర్ మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుణదలమేరీ మాత విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్ఆర్సిపి బలోపేతం అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.గాలాయగూడెం ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలతో సుఖసంతోషాలతో చల్లగా ఆరోగ్యంగా ఉండాలని మేరీ మాత ను కోరుకున్నారు.

## దెందులూరులో పెద్దింట్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే చింతమనేని





**దెందులూరు మార్చి 25** :దెందులూరు మండలం దెందులూరు గ్రామంలోని శ్రీ పెద్దింట్లమ్మవారి 46వ తీర్థ మహోత్సవాల్లో దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ పాల్గొని నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ కి ఉత్సవ కమిటీ నిర్వాహక సభ్యులు, స్థానిక కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దెందులూరు టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ గారపాటి కొండయ్య చౌదరి. గ్రామ టిడిపి అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు యాదవ్. ఏపీ యాదవ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్. గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ. టిడిపి నేత సంపంగి వేణుగోపాల తిలక్. కొలుసు నాని. దాసే శ్రీను. తదితరులు ఉన్నారు.

## బాల బాలికలకు వినికిడి లోపం పరికరాలు పంపిణీ




**అనంతపురం మార్చి 25 నవభూమి** :రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గల జిల్లా త్వరిత చికిత్స కేంద్రం లో జిల్లా వైద్యాధికారి డా . ఈ .బి దేవి ,సూపరింటెండెంట్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వర రావు ఆధ్వర్యం లో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా .జి .నారాయణస్వామి దివ్యాంగ మాసోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన వినికిడి లోపం గల బాల బాలికలకు వారి తల్లిదండ్రులకు పుట్టుకతో వచ్చు లోపాలపై అవగాహన కల్పించి అనంతరం మూడవ విడత కింద వినికిడి లోపం గల 50 మంది పిల్లలకు దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ , జిల్లా త్వరిత కేంద్రం వారి ఆధ్వర్యంలో సెకి-సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక సహకారంతో వినికిడి యంత్రాలను అందించామని డా.నారాయణస్వామి పేర్కొన్నారు .ఈ ఏడాదిలో పుట్టుకతో వినికిడి లోపం గల 344 మంది పిల్లలను గుర్తించి మొదటి దశ గా (17-3-2025) 80 మంది పిల్లలకు రెండవ దశగా ( 18-3-2025 )వ తేదీన 84 మంది పిల్లలకు ఒకొక్కరికి 30000 విలువగల వినికిడి నివారణ యంత్రాలు ఉచితంగా అందించారు. ఈ మూడు విడతలుగా కార్యక్రమానికి మొత్తం 64 లక్షల ఇరవై వేల రూపాయల విలువైన వినికిడి పరికరాలను దివ్యాంగ పిల్లలకు ఉచితంగా అందజేశారు.జిల్లా వైద్య శాఖ అధికారి మాట్లాడుతూ వినికిడి యంత్రాలను ఉచితంగా అందజేసిన దీనదయాళ్ ఫౌండేషన్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డా. శ్రీవిద్య , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ నాయక్ ,మేనేజర్ రజిత , ఆడియోలజిస్ట్ గీత,దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ రవితేజ , సక్ష్యం జిల్లా కన్వీనర్ పవన్ కుమార్ మరియు డి ఈ ఐ సి సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాలయాలను పరిరక్షించాలి: ఎమ్మెల్యే దేవ

**మామిడికుదురు. మార్చి23. నవభూమి.** దేవాలయాల పరిరక్షణకు పాలకవర్గాలు బాధ్యత తీసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు మామిడికుదురు మండలం ఈదరాడ గ్రామ దేవత శ్రీ పాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుచే ఎమ్మెల్యే మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు భక్తులు మనోభావాలకు అనుగుణంగా ధర్మకర్తల మండలి ఆలయాలను అభివృద్ధి చేయాలన్నారు ఆధ్యాత్మిక పరివర్తనతో పని చేయవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. పాలమ్మ అమ్మ ఆలయం ధర్మకర్తల చైర్మన్ సాధనాల సుబ్బారావు. సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



# శంకర్ నారాయణ రాజకీయ భవిష్యత్తు?

◆ వైసిపి కార్యక్రమాల్లో కనిపించని శంకర్ ◆ వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ శంకర్ నారాయణ మధ్య వర్గ విభేదాలు
◆ జిల్లా అధ్యక్షుడిగా 12 ఏళ్లు పనిచేసిన వైనం ◆ 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా మంత్రిగా పదవులు





**అనంతపురం బ్యూరో మార్చి 25 నవభూమి** :ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరు ఊహించెదరు అనే సినిమా పాటను తరచూ వింటుంటాం. మనిషి జీవితంలో కూడా ఏ నిమిషానికి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. కాలం కలిసి వచ్చినపుడు మనిషి జీవితం కూడా టర్న్ అవుతుంది. కాలం కలిసి రానప్పుడు పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ప్రస్తుతం మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్యే శంకర్ నారాయణ రాజకీయ పరిస్థితి సరిగా లేదని చెప్పవచ్చు. ధర్మవరం నియోజవర్గంలో వకీల్ పెదయ్య పేరు తెలియని వారు ఉండరు. వకీల్ పెదయ్య తెలుగుదేశం పార్టీలో ధర్మవరం మున్సిపల్ చైర్మన్గా పనిచేశారు. ఆ తర్వాత ఆయన కుమారుడు మాల గుండ్ల శంకర్ నారాయణ తెలుగుదేశం పార్టీలో ధర్మవరం పట్టణంలో ఐదేళ్లపాటుకౌన్సిలర్ గా పని చేశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీలో సరైన అవకాశాలు రాకపోవడంతో 2011లో వైసిపి పార్టీ ఆవిర్భావం తర్వాత వైసిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2011 నుంచి 2019 వరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. ఆ తర్వాత 2023 లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు విభజన కావడంతో అప్పటివరకు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గానే శంకర్ నారాయణ ఉన్నారు. ఆ తర్వాత శ్రీ సత్య సాయి జిల్లా వైసిపి పార్టీ జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2014లో పెనుకొండ వైసిపి పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మాలగుండ్ల శంకర్ నారాయణ ఆ ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి బికే పార్థసారథి పై ఓడిపోయారు. ఆ తర్వాత 2019లో వైసీపీ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగాపోటీ చేసిన శంకర్ నారాయణ 15000 పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. దీంతో వైసీపీ పార్టీ అధినేత అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన క్యాబినెట్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. ఆ తర్వాత ఏడాది వ్యవధిలోని శంకర్ నారాయణ కు రోడ్లు భవనాల శాఖ మంత్రిగా క్యాబినెట్లో చోటు కల్పించారు. మూడు సంవత్సరాలు పాటు మంత్రిగా పనిచేశారు. మూడు సంవత్సరాల తర్వాత కేబినెట్విస్తరణ జరగడంతో కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే ఉష శ్రీ చరణ్ కు క్యాబినెట్లో అవకాశం కల్పించి శ్రీ సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతల ను అప్పగించారు. ఆ తర్వాత 2024 సంవత్సరంలో సాధారణ ఎన్నికలు రానే వచ్చాయి. అప్పుడు వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేర్పులు చేశారు. కొంతమంది ఎమ్మెల్యే అభ్యర్థులను ఒకచోట నుంచి మరొక చోటకి మార్చడం జరిగింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే గా ఉన్న ఉష శ్రీ చరణ్ ను పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ని లిపారు. పెనుకొండ ఎమ్మెల్యేగా ఉన్న శంకర్ నారాయణ ను అనంతపురం పార్లమెంట్ నుంచి పోటీ చేయాలని వైసీపీ అధినేత ఆదేశించారు. దీంతో పెనుకొండ నుంచి ఉష శ్రీ చరణ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనంతపురం ఎంపీ అభ్యర్థిగా శంకర్ నారాయణ పోటీ చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి హవా ఉండడంతో జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు రెండు ఎంపీ స్థానాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించారు. జిల్లాలో 2024 ఎన్నికల్లో వైసిపి ఘోర పరాభవం చెందడం తో వైసిపి మాజీ ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు డీలా పడ్డారు. కొన్ని నెలలపాటు సైలెంట్ అయినా వైసిపి మాజీ ఎమ్మెల్యేలు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆందోళనలు, ధర్నాలు చేపడుతున్నారు. అయితే రాష్ట్రంలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పలు నియోజవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలకు, మాజీ ఎంపీలకు పార్టీ పదవులు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఉష శ్రీ చరణ్ కు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. గత 13 సంవత్సరాలుగా పెనుకొండ ఉన్న మాల గుండ్ల శంకర్ నారాయణ కు ఎటువంటి పార్టీ పదవి కూడా లభించలేదు. అనంతపురం పార్లమెంటు నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాల గుండ్ల శంకర్ నారాయణ అనంతపురం పార్లమెంటుపై దృష్టి సారించలేదు. పెనుకొండ లో ఎక్కువకాలం గడిపిన శంకర్ నారాయణ పెనుకొండ ప్రాంతం నుంచే రాజకీయాలు చేయాలని ఆ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఆయన అంచనాలు తారు మారయ్యాయి. శ్రీ సత్యసాయి వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ మధ్య శంకర నారాయణ మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఇద్దరూ మాజీ ప్రజా ప్రతినిధులు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో విభేదాలు శృతిమించాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు మాజీ ప్రజా ప్రతినిధులను విజయవాడకు పిలిపించి సర్ది చెప్పారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ కు శ్రీ సత్య సాయి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షురాలుగా నియమించారు. అప్పటినుంచి మాజీ మంత్రి ఉష శ్రీ చరణ్ శ్రీ సత్య సాయి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఉషశ్రీ చరణకు పెనుకొండ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడంతో ఉష శ్రీ చరణ్ గుడ్ మార్నింగ్ పేరుతో పెనుకొండ నియోజవర్గంలో ప్రతి మండలంలో ప్రతి గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే మాజీ మంత్రి మాల గుండ్ల శంకర్ నారాయణ రాజకీయ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని మాల గుండ్ల శంకర్ నారాయణ వైసీపీ పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడ కనిపించలేదని మీడియా కూడా ఎక్కడా కనిపించలేదని పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు.

### నీలా వ్యక్తిగత దూషణలకు పోలేదు..అలా మొదలుపెడితే

# నీకంటే బాగా తిడతాం

◆ పరిటాల కుటుంబాన్ని ఉపయోగించుకుని కొత్తపల్లి మోహన్‌రెడ్డి భూ వివాదంలోకి
◆ పరిటాల సునీత సోదరుడు, రాప్తాడు మండల టిడిపి ఇన్‌చార్జ్ మురళి ప్రోత్సహించాడు




**అనంతపురం మార్చి 25 నవభూమి** :పరిటాల సునీత... మీలా వ్యక్తిగత దూషణలకు పోలేదు. అలా మొదలుపెడితే నీకంటే బాగా తిడతాం' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాప్తాడు మండలం కొత్తపల్లి మోహన్‌రెడ్డిపై దాడి కేసులో అరెస్టయిన చింతపంటి సుధాకరరెడ్డి, దివాకర్‌రెడ్డి ఇద్దరూ ఇది పూర్తిగా భూ వివాదానికి సంబంధించిన వ్యవహారమని పోలీసుల విచారణలో స్పష్టం చేశారు. గతంలోబుక్కరాయసముద్రానికి సంబంధించి ఎస్సీ కుటుంబీకుడి నుంచి చింతపంటి సుధాకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి ఆత్మకూరు మండలం వడ్డిపల్లిలో 26 సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. వారి ఆధీనంలోనే ఈ భూమి ఉంది. గడ్డివాము, పశువుల పాకాగా ఉపయోగించుకుంటూ వచ్చారు. శాశ్వత విక్రయ ఖరారునామా రాయించుకున్నారు..ఇదే భూమికి సంబంధించి ఇటీవల మరో వ్యక్తికి అప్పట్లో శాశ్వత విక్రయ ఖరారునామా చేసిన వారి వారసులు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధం, చట్టరీ త్యా అది చెల్లుబాటు కాదు. ఈ డాక్యుమెంట్ ఆధారంగా కొత్తపల్లి మోహన్‌రెడ్డి అనే వ్యక్తి ఈ భూ వివాదంలోకి ప్రవేశించాడు. ఆయనకు సమీప బంధువులైన సుధాకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డితో పలుమార్లు చర్చించారు. వాగ్వాదాలు జరిగాయి. అందరి సహకారంతో కొత్తపల్లి మోహన్‌రెడ్డిని నేనే సర్పంచ్‌గా అవకాశం కల్పించాను. సుధాకర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి మా పార్టీ కార్యకర్తలు. వీరు టిడిపి నాయకుడు చింతపంటి మల్లికార్జునరెడ్డికి సమీప బంధువులు. పార్టీలు వేరైనా నియోజకవర్గంలో ఒక కులంలో బంధువుల మధ్య గొడవలు పెట్టాలని మేము ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఈ చిన్న సమస్యను పరిష్కరించలేక పరిటాల సునీత దాడికి కారణమైందా?కొత్తపల్లి మోహన్‌రెడ్డి మా పార్టి అధికారంలోకి ఉన్నప్పుడు ఆర్థికంగా లాభపడలేకపోయాడు. ఇలాంటి వారు చాలామందే ఉన్నారు. అసంతృప్తితో కొందరు పార్టి వీడగా, మరికొందరు తప్పనిపరిస్థితుల్లో పార్టికోసం పని చేశారు. వారి పార్టీ కోసం బలంగా పని చేసిన మోహన్‌రెడ్డికి పరిటాల కుటుంబం ఆర్థిక సాయం చేసిండొచ్చు, లేదా ఆయన బతుకుదెరువు కోసం ఏదైనా అవకాశం కల్పించిండొచ్చు. ఆ పని చేయలేదు. బాధ్యత కల్గిన ఎంఎల్ఏగా నేను ఆ మోహన్‌రెడ్డితో పాటు ఆయన చెప్పిన 9 మంది రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించా. కార్యకర్తలు, ప్రజలు మేలు చేసే నాయకుడిగా నేను చేసిన సాయం అది. అయినా సంతృప్తి చెందక టిడిపిలోకి వెళ్లాడు..పరిటాల కుటుంబం అంటేనే అక్రమణలు, కబ్జాలు, దౌర్జన్యాలకు పెట్టింది పేరు. అలాంటి కుటుంబాన్ని ఉపయోగించుకుని భూ వివాదంలోకి వెళ్లడం పొరబాటు. పరిటాల సునీత సోదరుడు, రాప్తాడు మండల టిడిపి ఇన్‌చార్జ్ మురళి ప్రోత్సహించాడు. ఈయన ప్రోత్సహంతోనే మోహన్‌రెడ్డి వడ్డిపల్లి భూ వివాదంలోకి దూరాడు. 60 లక్షల రూపాయలు డిమాండ్ చేశాడు. అంతమాత్రాన ఆయనపై దాడి చేయడం కరెక్ట్ కాదు. అయితే తనది కాని భూమికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించుకుని వెళ్లడం కరెక్ట్ కాదు. దీని వెనుక ఎవరు ఉన్నా చర్యలు తీసుకోవాలని పరిటాల సునీత మాట్లాడుతున్నారు. నేను ఫోన్ చేసేదాకా ఎస్ పీ, డిఎస్పి పట్టించుకోలేదంటున్నారు. అమ్మా...నువ్వు ఎన్ని గంటలకు ఫోన్ చేశావో ఏమోకాని తెల్లవారుజామునే నిందితులను పట్టుకుని కస్టడిలో ఉంచుకుని విచారిస్తున్నారు. ముందు మీ కార్యకర్తలకు ఉపాధి మార్గాలు చూపించు. నువ్వేమో అనంతపురం పట్టణం, పాపంపేట, కురుగుంట, సజ్జలకాలువ ప్రాంతాల్లో భూ ఆక్రమణలకు పాల్పడుతున్నావు. ఆవు చేనులో మేస్తే దూడ గట్టున మేస్తాదా? అన్న చందంగా నిన్ను నమ్ముకున్న నాయకులు నీ మార్గంలో వెళ్తున్నారు. అలాంటి వారిని నీ తమ్ముడు ప్రోత్సహిస్తున్నాడు.నేను మాట్లాడేటప్పుడు ఆధారాలతో సహ మాట్లాడతాను. నువ్వు పాపంపేటలో కబ్జాకు పాల్పడ్డావనేది ఆ ప్రాంత చుట్టుపక్కల పంచాయతీల్లో చిన్నపిల్లాడిని అడిగినా చెబుతాడు. ప్రకాష్‌రెడ్డి కబ్జా చేసేవాడు కాదు. పదిమందికి సాయం చేసేవాడు. నువ్వు, నీకుటుంబానికి కబ్జా చరిత్ర ఉంది. మహిళా గౌరవించి మాట్లాడుతున్నా. నీ నీచ చరిత్ర గురించి మాత్రమే చెబుతున్నాను. నీ మాదిరి వ్యక్తిగత దూషణలకు పోలేదు. అలా మొదలుపెడితే నీకంటే బాగా తిడతాం. రాప్తాడు మండలంలో 2014%-%19 మధ్య చిచ్చు పెట్టావు.నియోజకవర్గమంతా గమనిస్తోంది. బాధ్యత కల్గిన ఎమ్మెల్యే సీటులో కూర్చున్నావు.నియోజకవర్గంలో ఎక్కడ చీమ చిటుక్కుమన్నా నీదే బాధ్యత. నువ్వు చేస్తున్న తప్పులను ఎత్తి చూపే హక్కు ప్రతి ఓటరుపై ఉంటుంది. మాటలు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని లేకపోతే తాను కూడా అదే రీతిలో మాట్లాడుతానని హెచ్చరించారు.

## రాయల చెరువును సందర్శించిన తహసిల్దార్



**పెద్దకడబూరు మార్చి 25 (నవభూమి)** :పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్న తుంబలం గ్రామంలో ఉన్న రాయలచెరువును మండల తహశీల్దార్ గీతా ప్రియదర్శిని గత వారం రోజులుగా ప్రచురితమైన వార్తలకు స్పందించారు.మంగళవారం చిన్నతుంబళంలో ఉన్న రాయల చెరువును ఆమె పరిశీలించారు.చెరువులో వ్యర్థాలు వేశారా అని వీఆర్ఎలచే తనిఖీ చేయించారు.వ్యర్థాలు,జంతు కళేబరాలు వేసినట్లు ఆనవాళ్లు ఏమీ కనిపించడం లేదని, క్యాట్ ఫిష్ పెంపకం జరుగుతున్నట్లయితే నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని వీఆర్వోను ఆదేశించారు అలాగే ఈ చెరువులో ఎవరైనా జంతువు కలేబరాలు అలాగే వ్యర్థ పదార్థాలు వేసినచో వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ విఆర్వో గ్రామ తలారులు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**ఎద్దు విలువ దాదాపు అక్షరాల 60 వేల రూపాయలు**


**కన్నీరు పెట్టుకున్న రైతన్నను ప్రభుత్వము ఆదుకోవాలి**



**పెద్దకడబూరు మార్చి 25 (నవభూమి)** :పెద్దకడబూరు మండల కేంద్రంలో మంగళవారం అదే గ్రామానికి చెందిన కురువ వెంకటేశ్ అనే రైతు పొలం పనుల నిమిత్తం తన రెండు ఎద్దులను పొలానికి తీసుకెళ్లాడు.మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ ఎద్దు పొలంలోని విద్యుత్ స్తంభాన్ని తాకింది.ఈ క్రమంలో ఒక్కసారిగా ఎద్దు విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.దాదాపు రూ.50వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నేరుగా విలపించారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు విచారణ చేసి కన్నీరు పెట్టుకున్న రైతన్నను ఆదుకోవాలని గ్రామ ప్రజలు తెలిపారు


## రైతుల భూ సమస్య సర్దుబాటు చేయడం సర్వేయర్ల బాధ్యత

**ఎమ్మార్వో గీత ప్రియదర్శిని వెల్లడి**



**పెద్దకడుబూరు మార్చి 25 (నవభూమి)** :పెద్దకడబూరు మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో సర్వేర్లు చేస్తున్న భూరీసర్వే ను అమె పరిశీలిం చారు.ఈసందర్భంగా అమె రైతులను సర్వేర్లును ఉద్దేశించి మాట్లాడాతూ భూరీసర్వే లోవచ్చిన చిన్న చిన్న లోసుగులను సర్దుబాట్లు చేయడం సర్వేర్లపైన ఎంతైనా ఉందనిఅమెవారికి సూచించారు.అలాగే భూ రీసర్వే కూడా పూర్తి అయ్యింది అని ఎవరి గట్లు వాళ్లకి చూపించడం జరుగుతుందని అమె అన్నారు.ఆన్లైన్లో భూమి ఎంత ఉంటే అంతే భూమిపైన ఉండే అవకాశం ఉంటుందని రైతులకు తెలిపారు.సర్వేలతో రైతులు గొడవలు పడి ఆటంకాలు కలిగించొద్దని రైతులకు సూచించారు.ఎట్టు పరిస్థితుల్లో భూ సమస్య ఇక్కడే సర్దుమనిగేటట్లు చూడాలని కోర్టు వ్యవహారాలు ఆర్ ఓ ఆర్ కేసులు వద్దు అని ఎమ్మార్వో గీత ప్రియదర్శని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో విఆర్వో.సర్వేర్లు గ్రామ టిడిపి నాయకులు. నరసింహులు మానప్ప నాగేష్ వీరేష్ అయ్యప్ప పెద్ద ఆంజనేయ హుసేని బసప్ప నరసయ్య అంగడి నరసింహారెడ్డి చంద్రయ్య రాజు మరియు గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ వేలం పాట నిర్వహణ




**బాపట్ల-నవభూమి** : బాపట్ల పురపాలక సంఘ పరిధిలో ఉన్న కూరగాయల సంద్రి మార్కెట్, కూరగాయల మార్కెట్ లోపలి 1 నుంచి 76 స్టాల్స్ రోజు వారి అద్దెలు వసూలు చేసుకొనుట మంగళవారం వేలం పాట నిర్వహించామని బాపట్ల పురపాలక సంఘం కమీషనరు జి రఘునాథ రెడ్డి తెలిపారు. మార్కెట్ లోని జంతు వధశాల, చేపల మార్కెట్ల యొక్క 2025-2026 ఆర్థిక సంవత్సరము తాలుకు ఆశీలు వసూలు చేసుకొను హక్కు కొరకై బహిరంగ వేలం పాటను కమిషనర్ నిర్వహించగా కూరగాయల, సంద్రి మార్కెట్ షేక్ జరీనా బేగం రూ.26,92,000 లు చేపల మార్కెట్ వేల్పుల కోటేశ్వరరావు రూ.5,15,000 లకు పాడుకొనియున్నారని తెలిపారు. కూరగాయల మార్కెట్ లోపలి 1 నుంచి 76 స్టాల్స్ రోజువారి అద్దెలు వసూలు చేసుకొనుట మాంసం జంతు వధశాల మార్కెట్ల పాటలను పాడుకొనేందుకు ఎవరూ ముందుకు రానందున వాయిదా వేయడమైనదని తెలిపారు.

# బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభను విజయవంతం చేయాలి



**ఐనవోలు-నవభూమి:** బీఆర్ఎస్ సిల్వర్ బూబ్లీ వేడుకల సభను విజయవంతం చేయాలని మంత్రి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఐనవోలు మండలం పంథిని గ్రామంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి, ఐనవోలు, వర్ధన్నపేట మండల ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి ఎర్రబెల్లి హాజరయ్యారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని, సుమారు మూడు మండల నుంచి 20 వేలకు పైగా జనం తరలాలని ఆయన పిలుపునిచ్చారు. మరో 24 గంటల్లో దేవన్నపేట పంప్‌హౌస్ మోటర్లు ఆన్ చేసి దేవాదుల నీరు వదలకపోతే రైతుల పక్షాన నిలిచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు చేసేందుకు కార్యాచరణ చేపడుతామని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల రైతు సంక్షేమా న్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ పాలనలో రూ.1400 కోట్లు వెచ్చించి ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేసి పూర్తి చేశామన్నారు. 14నెలల కింద అప్పటి ప్రభుత్వమే పంప్‌హౌస్‌ను ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ మూలం గా వాయిదాపడిందన్నా రు.పూర్తిస్థాయిలో అందుబాటులోని వచ్చిన ఈ పంప్‌హౌస్‌ను కేవలం పాలకులకు అవగాహన, ఆలోచన లేకనే నీరందించడం లేదని, ఫలితంగా ఆయకట్టు రైతులు లక్షల ఎకరాల్లో యాసం గి పంట నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పంటలు ఎండిపోలేదని రేవంత్‌రెడ్డి వచ్చాక మార్పు చూపిస్తున్నాడని రైతులే అంటున్నారని చెప్పారు.

## కోనసీమ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి: జెసి టి నిశాంతి



**అమలాపురం. మార్చి23.( నవ భూమి ప్రతినిధి)** రెవిన్యూ రికార్డు ల నిర్వహణలో అంబేద్కర్ కోనసీమ జిల్లా ను ప్రథమ స్థానంలో నిలపాలని . జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి సూచించారు. అమలాపురంలోని కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద రెవెన్యూ ఉద్యోగులతో ఆమె మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫైలింగ్ నిర్వహణ విధి విధానాల పట్ల వారికి ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రిపోర్టులో స్పష్టత తయారు చేసేందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను జోడిస్తూ పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం భూమి సేకరణకు ఈ రికార్డుల ఆధారమన్నారు భూ రికార్డులు పన్ను రికార్డులు ఆస్తికార్డులు మరియు ఇతర సంబంధిత పత్రాలను నిర్వహించే ప్రక్రియ రెవెన్యూ శాఖ యొక్క ముఖ్యమైన బాధ్యత అని ఇది పౌరులకు ప్రభుత్వానికి ముఖ్యమైన సమాచారాన్ని అందిస్తుందన్నారు .గ్రామస్థాయి వీఆర్వో నుండి కలెక్టరేట్ వరకు రెవెన్యూ సంబంధిత నివేదికలు సకాలంలో స్పష్టతతో రికార్డులు రూపొందించి సమర్పించాలన్నారు క్షేత్రస్థాయి నుండి భూ సమస్యలపై సంబంధిత తహసిల్దార్లు వీఆర్వోలు ఎప్పటికప్పుడు నిజాయితీగా విచారించి కలెక్టరేట్ కు సమర్పించాలని భూ సమస్యలపై తహసిల్దార్లు వీఆర్వోలు విచారణ జరిపి. కలెక్టరేట్కు నివేదికను పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కదలి కాశీ విశ్వేశ్వరరావు సెక్షన్ సూపర్ ఇండెంట్లు శివరాజ్ రమణకుమారి ఉప తహసిల్దార్లు వంశీ ఏసుబాబు సిబ్బంది భరత తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె ఆధ్వర్యంలో ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం

### రెండు గంటలకు యూనిట్ క్లస్టర్ మండల అధ్యక్షులు మండల పార్టీ నాయకులతో టిడిపి కార్యాలయంలో సమన్వయ సమావేశం



**అనంతపురం మార్చి 25 నవభూమి :**తెలుగుదేశం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బుధవారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా గ్రీవెన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకోగలరు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం రెండు గంటల నుంచి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అధిష్టానం ఆదేశాల మేరకు యూనిట్ క్లస్టర్ మండల కన్వీనర్లు మండల పార్టీ నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమానికి మండల పార్టీ నాయకులు యూనిట్ ఇన్చార్జులు క్లస్టర్ ఇంచార్జీలు మండల కన్వీనర్లు తప్పకుండా హాజరు కావాలని తెలియజేశారు.

## లిబాపట్ల టౌన్ చిల్లర గొల్లపాలెం రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహం



**బాపట్ల - నవభూమి :** బాపట్లలోని చిల్లర గొల్లపాలెం రైల్వే ట్రాక్ పక్కన మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతి దేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కోటపాడులో భారీ అన్నసమారాధన

**మాడుగుల మార్చి 25 నవ భూమి :**మాడుగుల : మండలంలో ఎం.కోటపాడుఎం కె వల్లాపురం గ్రామాల్లో కొలువు దీరినశ్రీ వీరాంజనేయ స్వామి వారి తీర్ధ మహోత్సవం సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కోట్ని శ్రీ రామూర్తి కుమారుడు నాగేశ్వర రావు , కీ.శే.కోట్ని వెంకటరావు కుమారుడు రైస్ మిల్లు ఓనర్ కోట్ని భీము నాయుడు. కోట్ని వెంకటరావు కుమారుడు విజయ్.ల ఆర్థిక సహాయంతో ఈ అన్న సమారాధన జరిగింది. ఉదయం నుంచే స్వామి వారి కి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించెందుకు స్థానిక ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



# పోలిట్ బ్యూరో సభ్యుడు టిడి జనార్ధన్‌కి ఘన స్వాగతం

- ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో ఘన స్వాగతం పలికిన అర్బన్ నాయకులు
- అర్బన్ నియోజకవర్గంలో నేతల అభిమానాన్ని మరువలేనన్న టీడీ జనార్ధన్



**అనంతపురం మార్చి 25 నవభూమి :**తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్ధన్ అనంతపురం నగరానికి వచ్చిన నేపథ్యంలో అర్బన్ నియోజకవర్గ టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో పెద్ద ఎత్తున నాయకులు తరలి వచ్చి టిడి జనార్ధన్‌కు స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, ఇతర అర్బన్ నాయకులు జనార్ధన్ ని కలిశారు. పుష్పగుచ్చాలు అందజేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల గురించి చర్చించారు. గతం కంటే టీడీపీ ఇప్పుడు అర్బన్ చాలా బలంగా ఉందని నాయకులు తెలిపారు. అందరూ ఐకమత్యంగా పార్టీ కోసం పని చేస్తున్నట్టు వివరించారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అధిష్టానం తగిన న్యాయం చేస్తుందని టీడీ జనార్ధన్ అన్నారు. మీరు చూపించిన అభిమానాన్ని మరులేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, తెలుగుమహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, ఆర్యవైశ్య నాయకుడు తాటి మధు, టీడీపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, ఓంకార్ రెడ్డి, గోపాల్ గౌడ్, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, తెలుగుమహిళా నాయకురాళ్ళు వడ్డే భవాని, చరిత, ఆయేషా, టీడీపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యానికి బానిసలు అవుతున్న విద్యార్థులు!

- ప్రభుత్వ మద్యం అంగట్లో సరుకులు లాగా విద్యార్థుల చేతుల్లోకి
- అనుమతి లేని బెల్ట్ షాపులను సీజ్ చేయాలి



**కోసిగి మార్చి25 (నవభూమి):**బడుల్లో ఉండి చదువు కోవాల్సిన విద్యార్థులు మద్యానికి బానిస లవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన కోసిగి తోపాటు, మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గల్లీ, గల్లీ లో ప్రభుత్వ బెల్ట్ షాపులు వెలిశాయని,దీంతో నివాస గృహాలు,కిరాణా షాపుల్లోనూ మద్యం విద్యార్థుల చేతులకు ప్రభుత్వ మద్యం అందుతుందని దాని ద్వారా విద్యార్థుల మధ్యానికి బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి గర్భగుడి లాంటి పాఠశాలల చుట్టుపక్కల మద్యం బాటిల్స్ కర్ణాటక, డబ్బాలు దర్శనమిస్తున్నాయని,అనేకమంది విద్యార్థులు,యువత, మద్యానికి బానిసలై కుటుంబాలకు తీరని అన్యాయం చేసి చనిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయని ఆయన అన్నారు. అలాగే ఎప్పుడంటే అప్పుడు.ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాపుల్లో మాదిరిగా కిరాణా షాపులల్లోనూ మద్యం దొరకడంతో పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు అనారోగ్యం పాలు కావడంతో పాటు అప్పుల పాలు కూడా అవుతున్నారన్నారు. దీంతో పచ్చని కాపురాలు రోడ్డున పడుతున్న పరిస్థితులు ఉన్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా వైన్స్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు మద్యం తరలించకుండా తగు చర్యలు తీసుకోవాలని అక్రమ మద్యం అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి అలాగే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏలాంటి మద్యం బాటిల్స్ కర్ణాటక డబ్బాలు దర్శనం ఇవ్వకుండా చూడాలని,ముఖ్యంగా విద్యార్థులకు మద్యం అమ్మకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ప్రజాసంఘాలను కలుపుకొని నిర్వహిస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి హనుమంతు నరసింహులు అశోక్ రాము తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను రప్పించండి

## ఎంపీడీవోపై సర్పంచులు ఆవేదన

- వర్గీకరణ వ్యతిరేకిస్తూ బాయ్ కాట్ చేసిన ప్రతినిధులు





**ఉప్పలగుప్తం (నవభూమి)**ప్రజా ప్రతినిధులకు సరియైన సమాచారం ఇచ్చే అధికారులు రానప్పుడు మండల సమావేశం నకు పిలవడం ఎందికని ఉప్పలగుప్తం మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ లు ధ్వజమెత్తారు. మంగళవారం జరిగిన మండల సమావేశంలో రాని అధికారులపై చర్య తీసుకోవాలని సంబందిత శాఖల అధికారులు రాకుండా గుమస్తాలను ప్యూన్ లను పంపుతున్నారని వారు మాకు అవసరమైన సమాచారం ఇవ్వగలరా అంటు సర్పంచ్ లు కేకలు పెట్టారు. విద్యుత్ అధికారి ఎందుకి గైర్హాజరు అయ్యారని నిలదీసారు . మండలంలో విద్యుత్ వాడకపోయినా వేలదిరూపాయుల బిల్లు వస్తుందని లో వోల్టేజ్ సమస్య ఉందని పగలు రాత్రులు విద్యుత్ సరఫరా నిపి వేస్తున్నారని సర్పంచ్ లు భద్రి బాబ్జీ నల్లా వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. సమావేశాలు కు రాని అధికారురపై చర్యలు చేపట్టాలన్నారు. ఇన్ చార్జి ఎంపి డి ఒ పి ఎస్ రాజ్ కుమార్ అధికారులంతా హాజరయ్యేందుకు చర్య తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో అధికారులందరు సమాచారంతో వచ్చే విధంగా చర్యలు గైకుంటామన్నారు.

మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని వేసవిలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. ఓవర్ హెడ్ ట్యాంక్ లు నిండకపోవడం వల్ల మంచినీరు అందించలేక పోతున్నామన్నారు రాజ్యాంగాన్నికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎస్ సి వర్గీకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఎంపిటిసి కొంకి ఏడుకొండలు సమావేశాన్ని బాయ్ కాట్ చేస్తున్నామని ప్రకటించడంతొ జడ్ పి టి సి గెడ్డం సంపద రావు తో పాటు అందరూ బయటకు వెళ్లడంతో సమావేశాన్ని ముగించినట్టు ఎంపి పి దంగేటి అచ్చుత జానకి ప్రకటించారు.

# ఏర్పాటుకు అనుమతులిచ్చిన అటవీశాఖ



**భూపాలపల్లి-నవభూమి :**తాడిచెర్ల ఓపెన్‌కాస్టు గని నుంచి కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)కు ఇక బొగ్గు రవాణా సులభతరం కానుంది. నిత్యం లారీల ద్వారా బొగ్గు రవాణా వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చు అధికంగా ఉంటున్నది. ఈ క్రమంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ , ఖర్చులను తగ్గించుకోవాలనే లక్ష్యంతో జెన్‌కో, ఏఎమ్మార్ సంస్థలు రూ. 100 కోట్లతో కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. తాడిచెర్ల ఓసీ నుంచి కేటీపీపీ వరకు సుమారు 19 కిలోమీటర్ల పొడవున దీనిని ఏర్పాటు చేసేందుకు రోడ్డు పనులు చేపట్టగా ప్రస్తుతం అవి చివరి దశలో ఉన్నాయి. రోడ్డు పూర్తి కాగానే కన్వేయర్ బెల్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పుడు తాడిచెర్ల ఓసీపీ నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేటీపీపీకి ప్రతి రోజు లారీల ద్వారా 7 వేల టన్నుల బొగ్గు రవాణా అవుతున్నది. కన్వేయర్ బెల్ట్ పనులు పూర్తయితే సుమారు 40 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. అలాగే ఈ మార్గంలో ప్రజలు తాడిచెర్ల మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు మెరుగుపడనున్నాయి. పర్యావరణం సేఫ్‌తాడిచెర్ల ఓసీపీ నుంచి 7 వేల టన్నులు, భూపాలపల్లి గనుల నుంచి 6 వేల టన్నుల బొగ్గు ప్రతిరోజు వందలాది లారీల్లో కేటీపీపీకి రవాణా అవుతున్నది. ఈ క్రమంలో ధ్వని, వాహన కాలుష్యంతో పర్యావరణం దెబ్బ తింటున్నది. దీనికి తోడు లారీలో ద్వారా బొగ్గు రవాణాకు ప్రతినెలా రూ. 2 నుంచి రూ. 3 కోట్ల ఖర్చవుతున్నదని అధికారులు చెబుతున్నారు. కన్వేయర్ బెల్ట్ ద్వారా బొగ్గు సరఫరా జరిగితే ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణం కూడా దెబ్బతినకుండా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. వచ్చే ఏడాది అందుబాటులోకితాడిచెర్ల ఓసీ నుంచి కేటీపీపీ వరకు కన్వేయర్ బెల్ట్ పనులు వచ్చే ఏడాది చివరి కల్లా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాడిచెర్ల నుంచి అటవీ ప్రాంతం గుండా కాశీంపల్లి శివారు, జంగేడు శివారు, సీపల్లి, కొంపెల్లి మీదుగా కేటీపీపీ వరకు బెల్ట్ నిర్మాణం జరగనుంది. అటవీశాఖ అనుమతులు సైతం రావడంతో రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. కేవలం కొంపెల్లి , సీపెల్లి గ్రామాల సమీపంలో 3.5 కిలోమీటర్ల పరిధిలో కొన్ని పంటలు ఉండడంతో రైతులు కొంత సమయం అడుగుతున్నారు. మిగిలిన రోడ్డు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దీంతో జయశంకర్ భూపాలపల్లి-పెద్దపల్లి జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

## పేదలకు అండగా ఉంటాం

### విద్యారణ్య నగర్ వాసులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భరోసా



**అనంతపురం మార్చి 25 నవభూమి :**తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ విద్యారంగనగర్ లో ఇళ్లను కూల్చివేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఏళ్ల తరబడి నివాసాలు ఉంటున్న పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని నేను ఎమ్మెల్యేగా ఉన్నంతవరకు మీ ఇళ్ల జోలికి ఎవరు రారని భరోసా ఇచ్చి అందుకు పూర్తి ఆధారాలను కలెక్టర్ ద్వారా హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయించడం వల్ల ఆ ప్రక్రియ ఆగిపోయిందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసిపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం విద్యారణ్య నగర్ లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్ల కూల్చివేత బాధితులతో మాట్లాడారు. 106-1 సర్వే నెంబర్ లో 68 సెంట్లలోని ఇళ్ల కూల్చివేతపై హైకోర్టులో స్టే తెచ్చామని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత హైకోర్టు మరో మరో 68 సెంటర్లలో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. గతంలో లాగానే కోర్టులో కౌంటర్ దాఖలు చేయడంలో అధికారులు చొరవ తీసుకోలేదన్నారు. స్థానిక ఎంఎల్ఏ సునీత మౌనం దాల్చడం వెనక ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. ఏది ఏమైనా పేదలకు నేను పూర్తిగా ఉండగా ఉంటాను. కోర్టు ఖర్చులు కూడా తానే భరిస్తాను. ఈ విషయంపై ఏ చిన్న ఇబ్బందులు వచ్చిన తానే స్వయంగా లాయర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని. పేదలు ఎవరూ ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కాబోయే పెళ్లి కొడుకుతోపాటు మరొకరికి గాయాలు








**కోసిగి మార్చి25 (నవభూమి)** కోసిగు హల్వి రోడ్డులో ని కోల్మ్ నపేట గ్రామం దగ్గర మంగళవారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదంలో కాబోయేపెళ్లి కుమారుడు కౌతాళం మండలం నదిచాగి గ్రామానికి చెందిన బోయ మహాదేవతోపాటు, కోసిగి మండలం కోల్మ్ నపేట గ్రామానికి చెందిన బళ్లారి మహాదేవకు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. బంధువులు తెలిపిన వివరాలు మేరకు నదిచాగి గ్రామానికి చెందిన బోయ మహాదేవా, కోల్మ్ న పేట గ్రామానికి చెందిన బళ్లారి మహాదేవలు ఇద్దరు అక్కచెల్లాల పిల్లలు .అయితే నదిచాగి గ్రామానికి చెందిన బోయ మహాదేవకు పెళ్లి నిక్షయమైయింది. దీంతో రెండు మూడురోజుల్లో ఎంగేజ్మెంట్ ఉండడం తో బంధువులకు చెప్పడానికని ఒకే మోటార్ సైకిల్ పై ఇద్దరు మహాదేవలు కోసిగి వైపు బయలు దేరారు. అయితే బారి స్పీడ్ తో ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ ఢీ కొనడంతో మోటార్ సైకిల్ నుజ్జునుజ్జు అయి తృటిలో ప్రాణాలతో బయట పడ్డారు..దీంతో పెళ్ళికొడుకు బోయ మహాదేవకు కాళ్లకు , చేతులకు గాయలుకాగా, బళ్లారి మహాదేవకు కుడి కాలు విరిగింది. వెంటనే బంధువులు ఆటోలో చికిత్స నిమిత్తం మై కోసిగి ఆసుపత్రికి తీసుకొని వచ్చి చికిత్స అనంతరం మెరుగైన చికిస్తాకై 108లో ఆదోని ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నాపై కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తున్నారు

### వారిపై పరువు నష్టం దావా వేస్తా: సాంబశివరావు



**దెందులూరు మార్చి 25 నవభూమి** :తెలుగుదేశం పార్టీ అభివృద్ధి సంక్షేమంతో పాటుగా పోనంగి గ్రామ అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తున్న తనను కావాలని కొంతమంది సోషల్ మీడియాలోనూ అసత్య ప్రచారాలు ప్రచారం చేస్తున్నారని వారిపై కోర్టులో దావా వేస్తానని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పోనంగి తెలుగుదేశం పార్టీ 14 వ డివిజన్ ఇంచార్జ్ సాంబశివరావు అన్నారు. పోణంగిలో విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ తాను మట్టి మాఫియా అక్రమ మట్టి మాఫియా పనులు చేయిస్తున్నానని కొంతమంది అసత్య ప్రచారం సోషల్ మీడియాలో చేస్తున్నారని కానీ తమ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఏలూరు రూరల్ తాసిల్దార్ వారికి తమ వ్యవసాయ క్షేత్రంలో మేరక ఉందని దాన్ని పళ్ళం చేసుకుంటామని దరఖాస్తు చేసుకుని ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి కి సైతం తెలియపరిచి అధికారులకు తెలియపరిచి పనులు చేసుకుంటుండగా పనులు ప్రారంభించిన 24 గంటలు కాకముందే పెద్ద ఎత్తున లక్షల ఎత్తున డబ్బులు సంపాదించారని కొన్ని యూట్యూబ్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని వారిపై కోర్టులో దావా వేసి చట్టపరం గా చర్యలు తీసుకుంటామని సాంబశివరావు అన్నారు ఇకనైనా అసత్య ప్రచారాలు మాను కోవాలి ఒక వ్యక్తిపై ఆరోపణలు చేసేటప్పుడు మీడియా గానీ పత్రికలు గాని ఎవరైనా వారి వివరణ తీసుకోవాలని అంతేగాని మంచి పేరు ఉన్న నాయకులపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని సాంబశివరావు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత బోసు బాబు తదితరులు ఉన్నారు

# 7న అరకులో మెగా యోగా



**అరకులోయ-నవభూమి** వచ్చే నెల ఏడో తేదీన 20 వేల మంది గిరిజన విద్యార్థులతో నిర్వహించే మెగా యోగాసనాల కార్యక్రమానికి స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిశేక్‌గౌడ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, మండల అధికారులతో కలిసి డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. 20 వేల మంది విద్యార్థులు 108 నిమిషాలపాటు నిర్వహించే 108 రకాల యోగాసనాలకు అవసరమైన స్థలం, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాట్ల నుంచి అధికారులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్‌లను ఆహ్వానించామన్నారు. 20 వేల మంది విద్యార్థులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కింద నుంచి పైస్థాయి వరకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం కళాశాలలో అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తరలింపునకు సుమారు 200 బస్సులు సమకూరుస్తున్నామని, వీటితోపాటు ప్రముఖులు వచ్చే వాహనాల పార్కింగ్ తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆయన వెంట డీఈవో బ్రహ్మాజీ, డీడీ రజని, టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, టీడబ్ల్యూ డీఈఈ సుబ్బారావు, తహసీల్దారు ఎం.వి.ఎస్ ప్రసాద్, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, టీడబ్ల్యూ ఏఈఈ అభిశేక్, తదితరులు వున్నారు.

## మోద కొండమ్మ అమ్మవారికి 300 గ్రాముల వెండి జ్యోతి కందులను విరాళంగా అందజేసిన భక్తులు



**మాడుగుల మార్చి 25 నవభూమి :**మాడుగుల : మండలం లోని ఎమ్.కోడూరు గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ మోద కొండమ్మ అమ్మవారికి భక్తులు 300 గ్రాముల వెండి జ్యోతి కుందులను విరాళంగా అందజేశారు.పాడేరు గ్రామానికి చెందిన గౌనూరి సత్యవతి ఆమె భర్త ( గౌనూరి కోటేశ్వర రావు) జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణేష్ లాస్య దంపతులు కలిసి అమ్మవారి కి 300 గ్రాముల వెండి జ్యోతి కుందులను విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు కు అందజేశారు.ఈ కార్యక్రమం లో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ , దేవరాపల్లి మండలం ఈ కొత్తపల్లి గ్రామస్తులు పిండం వెంకట రమణ రాజేశ్వరి దంపతులు , ముమ్మిన ప్రవీణ్ , అప్పాన వెంకట రమణ , జోన్నపల్లి నాగరాజు , కలిమి శివ , కలిమి గోపాల్ , పడాల అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ భీ పడాయి అంగన్వాడీ కార్యకర్తలు 3 రోజుల శిక్షణ



**మామిడికుదురు. మార్చి23. నవభూమి:** మామిడి కుదురుమండలంల పరిధిలోని . ఈదరాడగ్రామంలో అంగన్వాడీ కార్యకర్తల పోషణ బీపడాయి బి పథకంపై మూడు రోజులు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిడిపిఓ విజయ శ్రీ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పిల్లలకు . ఆరేళ్ల వయసులోనే మెదడు 85% అభివృద్ధి సాధిస్తుందని అన్నారు ఈ సమయంలో సరైన పోషణ విద్యను అందించడం ఎంతో అవసరమని ఇందుకోసం కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ బి పడాయి బి కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న బాల బాలికలకు విద్య ఆరోగ్యం పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం




**సీతారామపురం మార్చి 25 నవభూమి :**సీతారామపురం మండల కేంద్రంలోని కుర్ర వీధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు ఏ స్వప్న, దంత వైద్యురాలు అనీస్ సల్మా దంతాలపై వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు అనీస్ సల్మా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి నోటి శుభ్రతను పాటించాలన్నారు.తల్లిదండ్రులు పిల్లల పట్ల, దంత సమస్యలు, రాకుండా పళ్ళు పుచ్చిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశాలు తదితరులు ఉన్నారు.

## ఆటో బోల్తా: ముగ్గురికి తీవ్ర గాయాలు





**పెద్దపంజాణి నవభూమి మార్చి 25 :**పెద్దపంజాణి మండలం కత్తర్లపల్లి గ్రామ సమీపంవద్ద షేర్ ఆటో ఫ్రంట్ వీల్ తెగిపోయి ఆటో బోల్తా ముగ్గురికి త్రివ గాయాలు .ఇద్దరి పరిస్థితి విషమం.చిత్తూరు జిల్లా పుంగనూరు పొట్టేళ్ల సంతలో పొట్టేలు కొనుగోలు చేసి పుంగనూరు నుంచి పెద్దపంజాణి మండలం కరసన పల్లెకుకు షేర్ ఆటోలో తరలిస్తుండగా. మార్గమధ్యంలో కత్తర్లపల్లి గ్రామ సమీపంలో షేర్ ఆటో ఫ్రంట్ వీల్ తెగిపోవడంతో ఆటో బోల్తా పడి పల్టీలు కొట్టడంతో, కరసనపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ 70 సంవత్సరాలు. చీమనపల్లి గ్రామానికి చెందిన అశోక్. 17 సంవత్సరాలు.షేర్ ఆటో డ్రైవర్ పురుషోత్తం 25 సంవత్సరాలు త్రివం గాయపడ్డారు. రోడ్డు ప్రమాదంలోగాయపడ్డ వారిని 108 వాహనం ద్వారా పుంగనూరు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటరమణ ,అశోక్, పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిఫారిసు చేశారు . ఘటనపై పోలీసుల కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు .పూర్తి వివరాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## కేజీ జీడీ పిక్కలకు రెండు వందలు రూపాయలు మద్దతు ధర

# ప్రభుత్వమే కోనుగోలు చేయాలి:సిపిఎం

◆ పేదలు సాగులో ఉన్న పోడు ఫారెస్ట్ భూముల కు పట్టాలు ఇచ్చి , ఆన్లైన్ సమస్యలు పరిష్కరించాలి




**మాడుగుల మార్చి 25 నవభూమి** :జీడి పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి కేజీ జీడీ పిక్కల కు రెండు వందలు రూపాయలు మద్దతు ధర ఇవ్వాలని , పోడు ఫారెస్ట్ భూములకు పట్టాలు ఇవ్వాలని గతంలో పట్టాలు ఇచ్చిన వారి అందరికీ ఆన్లైన్ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యం లో గిరిజనులు పేదలు మంగళ వారం దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున దర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న మండల కార్యదర్శి బిటి దోర మాట్లాడుతూ జీడి పంటకు గిట్టు బాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు ప్రభుత్వం వరి,చెరకు,పత్తి మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని , కాని జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు.మార్కెట్ సౌకర్యం కల్పించక పోవడం ధర కూడా నిలకడగా ఉండకపోవడం జీడి పిక్కల పంట సమయంలో వ్యాపారులు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.వ్యాపారుల చేతికి జీడి పిక్కలు చేరిన తరువాత అమాంతం గా జీడి ధర పెరుగుపోతుందని తెలిపారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేసారు. జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగా నిర్ణయించి అమలు చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి , జీడి రైతులను మోసగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 80 కేజీల జీడి పిక్కల బస్తా కు వ్యాపారులు రూ. 8,000/-మాత్రమే చెల్లిస్తు న్నారని, దీంతో జీడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురి అవుతున్నారని అన్నారు. జీడిపప్పు బస్తా 80 కేజీలు పిక్కలకు 22 కేజీలు పప్పు వస్తుందని తెలిపార. మరో 3 కేజీలు ముక్కలు,తొక్కలు ఒక బస్తాకు 50 కేజీలు వస్తాయని , దీని ప్రకారం ప్రస్తుత మార్కెట్లో ధరల ప్రకారం సుమారు బస్తాకు రూ.19,40 లు ఆదాయం వ్యాపారులకు వస్తుందన్నారు. ప్రోసెసింగ్ ఖర్చు బస్తా కు రూ.2,000 లు, రైతుకు చెల్లించే రూ.16,000/- లు కలిపి మొత్తం రూ.18,000 లు ఖర్చులకు పోగా ఒక బస్తా కు రూ.1900 లు వ్యాపారులకు మిగులుతుందని తెలిపారు.మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు.కేజీ జీడీ పిక్కల కు రెండు వందలు రూపాయలు మద్దతు ధర ఇవ్వాలని రైతు భరోసా కేంద్రాలు ద్వారా ప్రభుత్వమే కోనుగోలు చేయాలని డిమాండ్ చేసారు.అనేక సంవత్సరాలుగా పేదలు గిరిజనులు పోడు పారెస్టు భూములు సాగు చేసుకుంటున్నారని , వారికి పట్టాలు ఇవ్వడం లేదని తెలిపారు.గతంలో పట్టాలు మంజూరు చేసిన వారికి ఆన్లైన్ చేయడం లేదన్నారు. రీసర్వే చేసిన రైతులకు పాస్ బుక్కులు ఇవ్వకుండా తత్సరాం చేయడంతో రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలు లు తో కూడిన వినతి పత్రం తహశీల్దార్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టి.శంకర్ , సిహెచ్ చిన దేముడు యం.ఎర్రు నాయుడు , జె.ఈశ్వరావు,మాసాడ సన్యాస రావు బి నాగేశ్వరరావు కె రాముడు రాజు తో పాటు అదిక సంఖ్యలో గిరిజనులు రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# దళారుల గుప్పెట్లో మిరియాల మార్కెటింగ్



**గూడెంకొత్తవీధి-నవభూమి:**ఆదివాసీ రైతులు పండించిన మిరియాలకు అంతర్జాతీయ ధరలు అందడంలేదు. ఇక్కడ ప్రత్యామ్నాయ మార్కెటింగ్ సదుపాయంలేకపోవడం వల్ల ప్రైవేటు వర్తకులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయించుకోవాల్సి వస్తున్నది. కొచ్చిన్ మార్కెట్‌లో మిరియాలు విక్రయిస్తున్న రైతులకు అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణమైన ధరలు లభిస్తుండగా, ఏజెన్సీ రైతులకు కిలోకు వంద రూపాయలకుపైగా తక్కువ ధర లభిస్తున్నది. కాఫీ తరహాలో మిరియాలకు కూడా గిరిజన సహకార సంస్థ మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.జిల్లాలో గిరిజన రైతులు కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాలను సాగు చేస్తున్నారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 98 వేల ఎకరాల్లో మిరియాల తోటలు వున్నాయి. గిరిజన రైతుల కోసం ఏర్పాటైన గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మిరియాలు కొనుగోలు చేయకపోవడంతో పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రైవేటు వర్తకులపై ఆధారపడాల్సి వస్తున్నది. దీంతో వారు చెప్పిన ధరకే మిరియాలు విక్రయిస్తున్నారు. దేశంలో మిరియాలు సాగు చేసే ప్రాంతాల్లో ధరలు ఎలా వున్నాయో తెలుసుకునే పరిజ్ఞానం ఇక్కడ రైతులకు లేకపోయింది. మిరియాల ప్రధాన మార్కెట్ కొచ్చిన్‌లో వుంది. ఇక్కడి ధరల ప్రకారం దేశంలోని ఇతర ప్రాంతాల్లో మిరియాల ధరలను నిర్ణయిస్తుంటారు. కొచ్చిన్ మార్కెట్ ధరలు ఇక్కడ రైతులకు తెలిసే అవకాశంలేదు. ప్రైవేటు వ్యాపారులు ఎప్పటికప్పుడు కొచ్చిన్‌లో ధరలను తెలుసుకుంటూ అక్కడ కన్నా 10-20 శాతం రేటు తగ్గించి ఇక్కడ కొనుగోలు చేస్తుంటారు. ఇదిలావుండగా కాఫీ ధరలను రైతులకు తెలియజేసేందుకు చింతపల్లి, పాడేరులో కేంద్ర కాఫీ బోర్డు విస్తరణ కార్యాలయాలు వున్నాయి. ఇదే తరహాలో మిరియాల రైతులను ప్రోత్సహించేందుకు, మార్కెటింగ్ సమాచారం అందించేందుకు ప్రభుత్వ సంస్థలు ఏర్పాట్లు చేయలేదు.కిలోకు రూ.100కుపైగా తేడాకొచ్చిన్ మార్కెట్ ధరలతో పోలిస్తే ఏజెన్సీలో ప్రైవేటు వర్తకులు కొనుగోలు చేస్తున్న ధరలు చాలా తక్కువగా వుంటున్నాయి. నవంబరులో మిరియాల మార్కెటింగ్ ప్రారంభమవుతుంది. ప్రస్తుతం కొచ్చిన్ మార్కెట్‌లో మొదటి రకం మిరియాలు కిలో రూ.708, రెండోవ రకం రూ.688 ధర పలుకుతున్నాయి. కానీ ఏజెన్సీలో వర్తకులు కిలో రూ.580-590కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కిలోకి రూ.100 వరకు ఇక్కడి రైతులు నష్టపోతున్నారు.జీసీసీ మార్కెటింగ్ చేయాలిమామిడి బాలయ్య, జీకేవీధిప్రైవేటు వర్తకులు అడిగిన రేటుకు మిరియాలు విక్రయించుకోవాల్సివస్తున్నది. కాఫీ మాదిరిగా మిరియాలకు కూడా జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే అంతర్జాతీయ ధరలు లభిస్తాయి. జీసీసీ ధరలు ప్రకటిస్తే ప్రైవేటు వర్తకులు సైతం అవే ధరలకు కొనుగోలు చేస్తారు. కలెక్టర్, జీసీసీ ఎండీ స్పందించి మిరియాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.

# ప్రభుత్వ భూమికి ఎసరు



**విశాఖపట్నం-నవభూమి:**ఆనందపురం మండలం ముచ్చెర్ల గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆ ప్రాంతానికి చెందిన ఒకరు బేరం పెట్టడం కలకలం రేపుతోంది. విజయనగరం సంస్థానం నుంచి తమకు వారసత్వంగా వచ్చిన భూమిగా పేర్కొంటూ పలువురి నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై కొందరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.రెవెన్యూ అధికారుల సమాచారం ప్రకారం ముచ్చెర్ల అన్‌సెటిల్ గ్రామం. పూర్వం విజయనగరం సంస్థానాన్ని పాలించిన పూసపాటి వంశీయుల ఆధీనంలో ఈ గ్రామం ఉండేది. అప్పట్లో తమ భూములు సర్వే చేయాల్సిందిగా మద్రాస్ ప్రెసిడెన్సీలో సర్వేయర్‌గా ఉన్న హెచ్‌జే గిల్‌మన్‌ను పూసపాటి వంశీయులు కోరారు. 1901 నుంచి 1903 వరకు గిల్‌మెన్ ఈ ప్రాంతంలో సర్వే చేసి విజయనగరం పూసపాటి వంశీయుల భూములపై రికార్డు రూపొందించారు. గిల్‌మన్ సర్వే చేసిన గ్రామాల్లో ముచ్చెర్ల కూడా ఉంది. అయితే అప్పట్లో విజయనగరం రాజుల నుంచి భూములను కొందరు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకునేవారు. మరికొందరికి రాజులే భూములు దానం చేశారు. రానురాను గ్రామంలో చాలావరకూ భూములు రైతుల ఆధీనంలో ఉండగా, మరికొన్ని ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో నమోదయ్యాయి. కొందరు రైతుల ఆధీనంలో ఉన్న భూములను ఒక మాజీ ప్రజా ప్రతినిధి అనధికారికంగా కొనుగోలు చేసి తన ఆధీనంలో ఉంచుకున్నారు. మరికొంత భూమిని రైతులు సాగు చేస్తూ జీడి, మామిడి తోటలు పెంచుకున్నారు. అయితే పూసపాటి వంశీయుల నుంచి దఖలు పడినట్టు కొందరు డాక్యుమెంట్లు సృష్టించి భూముల స్వాధీనానికి యత్నించడం, రైతులు ప్రతిఘటించడం, తదితర కారణాలతో గ్రామాన్ని అన్‌సెటిల్‌గా రెవెన్యూ శాఖ గుర్తించింది. గ్రామంలోని సర్వే నంబరు 2 నుంచి 36 వరకు మొత్తం 125 ఎకరాలను 2017లో జిల్లా యంత్రాంగం ప్రభుత్వ నిషేధ భూముల జాబితా (22-ఎ)లో చేర్చింది. ఈ మేరకు ఆనందపురం తహసీల్దార్ ఒక సర్క్యులర్ జారీచేశారు. అలాగే సర్వేనంబర్ 13లో 87.6 ఎకరాల బంజరు ఉండగా, అందులో సుమారు 41.89 ఎకరాలకు గ్రామంలో భూమి లేని పేదలకు చాలాకాలం క్రితమే ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఇంకా 45.71 ఎకరాల భూమి బంజరుగా ఉంది. కొందరు రైతులు ఈ భూమిలో జీడి, మామిడి తోటలు పెంచుకుని జీవనం సాగిస్తున్నారు. ఇదిలావుండగా నగరానికి ఆనుకుని ఉన్న ఆనందపురం మండలంలో భూములకు విలువ పెరగడంతో అదే ప్రాంతానికి చెందిన ఒకరు రంగంలోకి దిగి 22-ఎలో ప్రభుత్వ బంజరుగా ఉన్న 45.71 ఎకరాలు, పేదలకు పట్టాలు ఇచ్చిన భూమి సుమారు 41.89 ఎకరాలు మొత్తం...87.6 ఎకరాలు విజయనగరం సంస్థానం నుంచి తమకు దఖలు పడిందని పేర్కొంటూ, వాటిని విక్రయించేందుకు కొద్దికాలంగా అడ్వాన్స్‌లు తీసుకున్నారు. అడ్వాన్స్‌లు ఇచ్చిన పలువురు ఆ తరువాత ఆనందపురం మండల తహసీల్దారు కార్యాలయం అధికారులను సంప్రతించగా అసలు విషయం తెలిసింది. ముచ్చెర్ల గ్రామంలో సర్వే నంబర్ 13లో మొత్తం బంజరుగా ఉందని, గతంలో 40 ఎకరాలకుపైగా పేదలకు పట్టాలు ఇచ్చామని వివరించారు. అయినా తాజాగా సదరు దళారి మరికొందరిని మోసంచేసి అడ్వాన్స్‌లు తీసుకున్నట్టు గుర్తించిన కొందరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆనందపురం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ వద్ద ప్రస్తావించగా ముచ్చెర్ల అన్ సెటిల్ గ్రామం అని పేర్కొన్నారు. అటువంటప్పుడు భూములు కొనుగోలు చేసేవారంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. సర్వే నంబర్ 13లో ఉన్న 45.71 ఎకరాలను 2017లో 22-ఎలో చేర్చామని, అది ప్రభుత్వ బంజరు అని స్పష్టంచేశారు.

## ఘనంగా మేకపాటి అభినవ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు..



**సీతారామపురం మార్చి 25 (నవభూమి):** బెంగళూరులోని మేకపాటి నివాసంలో యువనేత మేకపాటి అభినవ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాంపురం మండల వైఎస్ఆర్సిపి నాయకులు మేకపాటి అభినవ్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ బొకేలు అందజేసి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం మండల కన్వీనర్ చింతంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి జెడ్పిటిసి చెరుకుపల్లి రమణారెడ్డి నాయకులు, గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి,బసిరెడ్డి కృష్ణారెడ్డి, బాలినేని మాబయ్య,కల్లూరు వెంకటేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ కాలనీలో పారిశుధ్య స్వయంగా పరిశీలించిన


### మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



**బాపట్ల-నవభూమి :**బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల నందు ఈరోజు ఉదయం మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పర్యటించారు.జి. బి. సి. రోడ్డు, విశ్వబ్రాహ్మణ కాలనీ వద్ద పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య కార్మికులతో నేరుగా మాట్లాడి రోజు వారి వార్డుల నందు నిర్వహిస్తున్న పారిశుధ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల నందు తప్పనిసరిగా డ్రైనేజీలను శుభ్రపరచాలన్నారు.రోడ్ల మార్జిన్ నందు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. దోమలు బెడద ఎక్కువగా ఉన్నందున ప్రతిరోజు తప్పనిసరిగా ఫాగ్గింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం జమ్ములపాలెం రోడ్డు, హెూసన్నా మందిర్ పక్క రోడ్డు నందు ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది ద్వారా చేపడుతున్న డ్రైనేజీ పూడిక తీత పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సూర్యలంక రోడ్డు లోని అన్న క్యాంటీన్ పరిశీలించిన ఆయన క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతూ క్యాంటీన్ పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన త్రాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. వారి వెంట మున్సిపల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి పురపాలక సంఘ సిబ్బంది ఉన్నారు.

## నిరుపేదలకు అభయహస్తం సీఎం సహాయ నిధి

### బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



**బాపట్ల -నవభూమి :** సీఎం సహాయ నిధి నిరుపేదలకు అభయహస్తం లాంటిదని బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్ర వర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం వ్యాప్తంగా అర్హులైన 5 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం సీఎం సంక్షేమ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పిట్టలవానిపాలెం మండల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందించకుండా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడిరదన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓవైపు ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూనే, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్యఖర్చులు భారం కాకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందజేస్తూ వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తోందన్నారు.ఇది పేదల ప్రభుత్వం వారి ఆరోగ్యాలకు భరోసానిచ్చే మనసున్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే నరేంద్ర కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎండి అఫ్జల్, టిడిపి నాయకులు వెంకటపతిరాజు, సాంబరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## హంద్రీనీవా లైనింగ్ ఆపాలి

**పుట్టపర్తి-నవభూమి :** హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే ఆపాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రశాంతి గ్రామం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువ వెడల్పు చేయాలని విడుదల చేసిన జీఓ నెంబర్లు 404,405 రదు చేయాలని, కాలువ లైనింగ్ పనులను ఆపకపోతే యంత్రాలను పగలకొడతామని హెచ్చరించారు. కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ పంట పొలాలకు నికరసాగు జలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షలకు పైగా ఎకరాలకు ఆయకట్టుకు నీరు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు హరి, నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జలసాధన సమితి గంగిరెడ్డి, మహదేవ, కాటమయ్య, గిరీశ, సోమశేఖర్ పాల్గొన్నారు.